క్లుప్తంగా

కాశీ విశ్వనాథునికి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సుప్రియ దంపతులు

ధర్మవరం రూరల్: పట్టణంలోని శివానగర్ శ్రీ బచ్చునాగంపల్లిలో కొలువైన కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వెండి ఆభరణాలు, వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి వేద పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సతీమణి కేతిరెడ్డి సుప్రియ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ముదిగుబ్బ: ముదిగుబ్బలో రూ.50 లక్షలతో నిర్మించిన తాగునీటి పైపులైన్‌ను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బుధవారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణ రెడ్డి తెలిపారు. కరెంట్ ఆఫీస్‌లో సెక్షన్ ఆఫీస్‌ను ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు తెలిపారు.

టెన్త్ మోడల్ పేపర్ల ఆవిష్కరణ


మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: పదో తరగతి విద్యార్థులకు రోటరీ క్లబ్ రూపొందించిన మోడల్ పేపర్లను ఆ సంస్థ ప్రతినిధులు మంగళవారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రశ్నాపత్రాలు విద్యార్థులకు ఉత్తమ మార్కులు సాధించేందుకు తోడ్పడతాయన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, నితిన్‌సాయి, తాహిర్‌వలీ పాల్గొన్నారు.

వైద్య సేవలు మెరుగుపరచండి


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. బుక్కపట్నంలోని పీహెచ్‌సీలో మంగళవారం ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశానికి చైర్మన్ హోదాలో ఎంపీపీ హాజరయ్యారు. కమిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమోదించి తీర్మానాలు చేశారు. సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, డీపీఎంఓ కుళ్లాయప్పనాయక్, వైస్ ఎంపీపీ పార్వతి, ఈశ్వర్, డాక్టర్ సునీల్, సూపర్‌వైజర్ రామ్మోహన్,శాంతి పాల్గొన్నారు.

చేనేత నాయకుడికి జ్యోతిరావు పూలే అవార్డు


అవార్డు చూపుతున్న చిప్పల మార్కండేయ

ధర్మవరం రూరల్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పల మార్కండేయ భారతీయ దళిత సాహిత్య అకాడమి న్యూఢిల్లీ వారి నుంచి మహాత్మ జ్యోతిరావు పూలే జాతీయ అవార్డు అందుకున్నారు. చేనేత రంగంలో చేసిన కృషిని గుర్తించి ఈనెల 11న ఆ అకాడమి నేషనల్ ప్రెసిడెంట్ ఎస్పీ సుమన్‌క్షర్ అవార్డు అందించినట్లు మార్కండేయ తెలిపారు. చేనేత సేవా కేంద్రం విజయవాడ ఆధ్వర్యంలో చేనేతపై శిక్షణ పొంది చీరాల, ధర్మవరం, అనంతపురం, కర్ణాటకలోని కార్మికులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తన కృషిని గుర్తించి అవార్డు అందజేశారన్నారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు

పుట్టపర్తి అర్బన్: కర్ణాటకలోని బెళగావిలో ఉన్న విశ్వేశ్వరయ్య యూనివర్సిటీలో ఈనెల 22నుంచి జరగనున్న ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సురేష్ కుమార్ తెలిపారు. బీబీఏ మూడో సంవత్సరం విద్యార్థి నజీర్‌హుస్సేన్, మొదటి సంవత్సరం విద్యార్థి కరుణాకర్ ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ఏఓ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్ బాబు, పీడీ శ్రీనివాసులు అభినందించారు.

జగనన్న చేసిన మంచిని వివరిద్దాం

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి


కదిరిలోని కంచుకోట వార్డులో జగనన్న కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

కదిరిటౌన్: సంక్షేమ పథకాల ద్వారా సీఎం జగనన్న అన్ని వర్గాలకు చేసిన మంచిని గడప గడపకూ వెళ్లి వివరిద్దామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కంచుకోట వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే హాజరై వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వార్డు పరిధిలో జరిగిన అభివృద్ధికి సంబంధించి ఏర్పాటు చేసిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో జగనన్న చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించి మరోమారు జగనన్న సీఎంగా ఎన్నిక కావాల్సిన ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. టీడీపీ పాలన, ప్రస్తుత జగనన్న పాలనలో ఉన్న తేడాను ప్రజలు గమనించాలన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తూ మళ్లీ ప్రజల వద్దకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారన్నారు. ప్రజలే బాబుకు బుద్ధి చెప్పాలని కోరారు. 2024 ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకునేలా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు.

ధర్మవరం రూరల్: పట్టణంలోని 13వ వార్డు బ్రాహ్మణి వీధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాలతో జరిగిన లబ్ధిపై ఏర్పాటు చేసిన బోర్డును మున్సిపల్ చైర్ పర్సన్ కాచర్ల లక్ష్మీ, వార్డు కౌన్సిలర్ స్వర్ణలత, జేసీఎస్ పట్టణ కన్వీనర్ మాసపల్లి సాయికుమార్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగనన్న వందశాతం నెరవేర్చారన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే మరోమారు జగనన్న సీఎంగా ఎన్నిక కావాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. వార్డు ఇన్‌చార్జ్‌లు తీర్థాల రమణ స్వామి, కత్తే పెద్దన్న, చాంద్‌బాషా, నీలూరి ప్రకాష్, కోఆప్షన్ మెంబర్ షమీం, సుభాన్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. నవరత్నాలులో భాగంగా అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీపీ నారాయణ రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్, సుధాకర్‌రెడ్డి, వెంకటేష్, వెంగళ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు. మండలంలోని తగరకుంటలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు తెలియజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వలంటీర్లు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రధాన వీధిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అగ్రీ బోర్డు చైర్మన్ వెంకటరాముడు, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగముని, చంద్రశేఖర్, నారాయణస్వామి, ప్రభంజన్‌రెడ్డి, సోమునాయక్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


ధర్మవరంలో ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ముదిగుబ్బ: మర్తాడులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


తగరకుంటలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మళ్లీ విజయదుందుభి మోగిద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- 2024లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం
- కార్యకర్తలకు, బూత్‌లెవల్ కమిటీలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపు

పుట్టపర్తి: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, పేదలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి 2024 ఎన్నికల్లో పుట్టపర్తి నియోజకవర్గంలో మరోమారు వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి తద్వారా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేద్దామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన నియోజకవర్గంలోని బూత్ లెవల్ కన్వీనర్లు, కమిటీ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. ప్రతి కార్యకర్తా సైనికుల్లా పనిచేసి పార్టీని విజయ పథంలో నడపాలని సూచించారు. ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యం తేవాలన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ఆ పార్టీ నాయకులు సర్వం దోచుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీలో నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలు, నాయకులు ఉన్నారన్నారు. 2019 ఎన్నికల సమయంలో పనిచేసినట్లుగానే ఈసారి కూడా చిత్తశుద్ధితో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు.

అభివృద్ధి పథంలో పుట్టపర్తి:
సీఎం జగన్ సహకారంతో పుట్టపర్తి నియోజకవర్గాన్ని నాలుగున్నరేళ్లలో ఎంతో అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తెలిపారు. కరువు కాటకాలతో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు 193 చెరువులకు హంద్రీ–నీవా కాలువ ద్వారా 3టీఎంసీల కృష్ణా జలాలు నింపేందుకు రూ.864 కోట్లతో అన్ని అనుమతులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే పనులు జరుగుతున్నాయన్నారు. ఊరూరా సిమెంట్ రోడ్లు వేశామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో మూడు జాతీయ రహదారులు మంజూరయ్యాయని, పనులు జోరుగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. సత్యసాయి బాబా నడయాడిన పుట్టపర్తి కేంద్రంగా సత్యసాయి జిల్లా చేయటం ఈ ప్రాంత వాసులకు పెద్ద వరమని ఎమ్మెల్యే మరోసారి స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లు, బూత్ లెవల్ కన్వీనర్లు, సభ్యులు హాజరయ్యారు.

నిష్పక్షపాతంగా క్లెయిమ్‌ల పరిష్కారం

- ఆర్డీఓ రమేష్‌రెడ్డి


మాట్లాడుతున్న ఆర్డీఓ రమేష్‌రెడ్డి

ధర్మవరం రూరల్: ఓటరు జాబితా సవరణకు సంబంధించి క్లెయిమ్స్ పరిష్కారంలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తామని, అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తామని ఆర్డీఓ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు ఇచ్చిన ఫిర్యాదులపై ఇప్పటికే విచారణ పూర్తి చేసి తగిన చర్యలు తీసుకున్నామన్నారు. ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి ముదిగుబ్బ మండలాల నుంచి ఆన్‌లైన్ ద్వారా ఫారం–6కు సంబంధించి సుమారు 6వేల దరఖాస్తులు, ఫారం–7కు 8వేలు, ఫారం–8కు 5వేల దరఖాస్తులు అందాయన్నారు. 70 శాతం దరఖాస్తులపై విచారణ పూర్తయ్యిందన్నారు. మిగిలిన వాటిని గడువులోపు పూర్తి చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, డిప్యూటీ తహసీల్దార్ హంపయ్య, వైఎస్సార్‌సీపీ, సీపీఐ, టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి


గాండ్లపెంటలో వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన దివ్యాంగులు

గాండ్లపెంట: జీవన జ్యోతి విభిన్న ప్రతిభా వంతుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో అంతర్జాతీయ ప్రతిభా వంతుల దినోత్సవాన్ని ఘనగా నిర్వహించారు. తొలుత స్థానిక ఆర్డీటీ కార్యాలయం నుంచి ర్యాలీగా వైఎస్సార్ సర్కిల్ చేరుకొని మానవహారంగా ఏర్పడ్డారు. విభిన్న ప్రతిభా వంతులను ఆదరించాలని, వారికి అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి తహసీల్దార్ హమీద్ బాషా, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ భరత్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు, సదుపాయాలను విభిన్న ప్రతిభావంతులు వినియోగించుకోవాలన్నారు. ఆర్డీటీ ఎస్‌టీఎల్ కేశవమూర్తి, జీవనజ్యోతి మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌ఖాన్, కొండారెడ్డి పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెలో పోస్టల్ ఉద్యోగులు


పుట్టపర్తిలో ఉద్యోగుల నిరసన

బత్తలపల్లి/పుట్టపర్తిటౌన్/గాండ్లపెంట/కదిరి అర్బన్/తాడిమర్రి: డిమాండ్ల సాధనకు ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్, పీజేసీఏ) పిలుపు మేరకు పోస్టల్ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. మంగళవారం బత్తలపల్లిలోని పోస్టల్ కార్యాలయం వద్ద పోస్టల్ సిబ్బంది నినాదాలు చేస్తూ సమ్మె చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ 7వ వేతన కమిటీలో అమలు కాని అంశాలతోపాటు మొత్తం 8 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చారని, వాటికి కేంద్ర ప్రభుత్వం హామీ వచ్చే వరకు విధులకు హాజరు కామని హెచ్చరించారు. డివిజన్ నాయకులు వెంకటనారాయణ తెలిపారు. పుట్టపర్తి హెడ్ పోస్టాఫీస్ కార్యాలయం ముందు జరిగిన ధర్నాలో సర్కిల్ అధ్యక్షుడు నాగరాజు, హిందూపురం డివిజన్ సెక్రటరీ జనార్దన, అధ్యక్షుడు అబ్దుల్ మునాఫ్, గౌరవాధ్యక్షుడు అల్లాబకాష్ పాల్గొన్నారు. గాండ్లపెంటలోని ఉప తపాలా కార్యాలయం ఎదుట తపాలా ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. నాయకులు బాబాఫకృద్దీన్, అమర్‌నాథ్‌రెడ్డి, శివయ్య, లక్ష్మీనాయక్, పాల్గొన్నారు. కదిరిలోని పోస్టాఫీసు వద్ద జరిగిన కార్యక్రమంలో రామచంద్ర, అబ్దుల్ మునాఫ్, నరసింహులు,ప్రభాకర్,నాగరాజు పాల్గొని మాట్లాడారు. తాడిమర్రిలోని పోస్టాఫీసు ముందు జీడీఎస్ పీజేసీఏ డివిజన్ నాయకులు రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోస్టల్ ఉద్యోగులు ధర్నా చేశారు.

రెండేళ్లుగా చేపలను పట్టనివ్వడం లేదు


మాట్లాడుతున్న సొసైటీ సభ్యులు

తనకల్లు: రెండేళ్లుగా ఫిషనరీస్ అధికారులు చేపలను పట్టనివ్వడం లేదని సీజీ ప్రాజెక్టు ఫిషర్‌మెన్ కో– ఆపరేటివ్ సొసైటీ సభ్యులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీజీ ప్రాజెక్టు ఫిషర్‌మెన్ కో–ఆపరేటీవ్ సొసైటీలో 30 మంది సభ్యులు ఉన్నారన్నారు. రెండేళ్లుగా ప్రాజెక్టులో చేపలు పట్టుకోడానికి ఏడాదికి రూ. 48 వేలు చొప్పున మొత్తం రూ. 96 వేలు చెల్లించామన్నారు. అయితే ఫిషనరీస్ శాఖ అధికారులు మాత్రం సొసైటీలోని కొందరు సభ్యులు అభ్యంతరం చెబుతున్నారంటూ చేపలను పట్టనివ్వడం లేదన్నారు. తాము వడ్డీలకు అప్పు తెచ్చి డిపాజిట్ చెల్లించామని పేర్కొన్నారు. మత్స్యశాఖ అధికారులు ప్రాజెక్టులో చేపలను పట్టుకోడానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సొసైటీ అధ్యక్షుడు బావాజీ, ఉపాధ్యక్షుడు వెంకటరమణ, డైరెక్టర్లు తిప్పన్న, గోపాల్‌నాయక్, తిప్పన్న, బాబ్‌జాన్, నరసింహులు పాల్గొన్నారు.

నేడు తారు రోడ్డు ప్రారంభం

ఎన్‌పీకుంట: ఎన్.పీ.కుంట–గాలివీడు ప్రధాన రహదారి నుంచి మండెంవారిపల్లి మీదుగా గెంగినాయునిపల్లి వరకు నిర్మించిన తారు రోడ్డును ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు ఎంపీపీ ఈటెరాము తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాలన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ


మృతుని కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: నల్లసింగయ్యగారిపల్లికి చెందిన కార్పెంటర్ రామాంజనేయులు నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద ప్రభుత్వం మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు మంజూరు చేసింది. ఈ మొత్తానికి చెందిన చెక్కును సోమవారం రాత్రి పుట్టపర్తిలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం ఎంతో భరోసా ఇస్తోందన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

కదిరి టౌన్: డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కదిరి పట్టణ ఐసీడీఎస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకురాలు మాబున్నీషా, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లగా మార్చాలని, ఉద్యోగ విరమణ తర్వాత ఉద్యోగుల తరహాలో ప్రయోజనాలు కల్పించాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వమే గ్యాస్ సిలిండర్లు సరాఫరా చేయాలని డిమాండ్ చేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

కదిరి అర్బన్: ప్రయాణికుల సమస్యలపై బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం మైనొద్దీన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రయాణికులు 08494224315 ల్యాండ్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలపై తనతో మాట్లాడవచ్చన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కదిరి అర్బన్: కరువుభత్యం, ఆర్జిత సెలవు సొమ్ము చెల్లించాలని స్థానిక ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మంగళవారం ధర్నా నిర్వహించారు. 2020 నుంచి 2023 వరకు 4 ఏళ్ల లీవ్‌ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు, నైట్ ఔట్ అలవెన్సు, ఇంటి అద్దె బకాయిలు చెల్లించాలన్నారు. ఎన్‌ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిమోహన్, డిపో అధ్యక్షుడు రామక్రిష్ణ, సెక్రటరీ బైరిశెట్టి, గంగన్న, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: ఎంప్‌ఎంయూ కార్మికులు పుట్టపర్తి డిపో ఎదుట మంగళవారం గేట్ మీట్ నిర్వహించారు. డిపో అధ్యక్షుడు శివశంకర్, ఉపాధ్యక్షుడు రవితేజ, రీజనల్ ఉపాధ్యక్షురాలు తిరుపతమ్మ, డిపో చైర్మన్ గంగులయ్య, కార్యదర్శి బాబ్జన్ గ్యారేజ్ ప్రసిడెంట్ ఈశ్వరప్ప, ట్రెజరర్ శివారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయలక్ష్మి, ప్రేమ్ కుమారి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

తనకల్లు: అక్రమంగా మద్యం సరఫరా అవుతుందన్న సమాచారంతో సెబ్ పోలీసులు మంగళవారం చీకటిమానిపల్లి వద్ద దాడి నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి రెండు బాక్సుల్లో తీసుకొస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

గాండ్లపెంట: హెచ్ఐవీ, ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జన జాగృతి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై గోడ పత్రికలు ఆవిష్కరించారు. హెచ్ఐవీ ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు, వాటి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జనజాగృతి సిబ్బంది సిబ్బంది నిర్మల, శైలజా, ఉషా పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ'

ఓడీచెరువు : మిట్టపల్లి సచివాలయ పరిధిలోని మిట్టపల్లి, వణుకువారిపల్లి , మల్లాపల్లెలో బుధవారం ఉదయం 8 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజునాయుడు తెలిపారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.


ఇంటి గోడలు కూల్చారని ఫిర్యాదు

కదిరి టౌన్: పట్టణంలోని హిందూపురం రోడ్డులో దివ్యాంగుల కాలనీ పక్కన నివాసం ఉంటున్న జె.షమీమ్ అనే మహిళకు రెవెన్యూ అధికారులు 2007లో ఇంటి పట్టా ఇచ్చారు. ఆ స్థలంలో ఇంటి నిర్మాణానికి పునాది వేసి గోడలు నిర్మించగా సోమవారం రాత్రి కదిరి పట్టణానికి చెందిన శీనానాయక్, గన్‌మాన్ షెక్షా, వారి అనుచరులు ఇనుపరాడ్లతో వచ్చి గోడలను కూల్చారని బాధితురాలి బంధువు ఎస్‌కే లియాకత్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో శీనానాయక్, గన్‌మాన్ షెక్షా, వారి అనుచరులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

కందిలో పంటకోత ప్రయోగాలు

కనగానపల్లి: మద్దెలచెరువు, వేపకుంట, భానుకోట గ్రామాల్లో డీవైఎస్ఓ గోపాల్ ఆధ్వర్యంలో వ్యవసాయ, గణాంక అధికారులు మంగళవారం కందిలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. 25 చ.మీ.లలో పంటను కోసి దిగుబడిని పరిశీలించారు. వర్షాలు రాక దిగుబడులు తగ్గి రైతులు చాలా నష్టపోయారని, ప్రభుత్వానికి సకాలంలో నివేదికలు పంపి రైతులకు తగు పరిహారం అందేలా చూడాలని జెడ్పీటీసీ మారుతీప్రసాద్ అధికారులకు సూచించారు. ఏఎస్ఓ రాజకుమారి, వీఆర్వో ముత్యాలు, వీఎస్ఏలు శివప్ప, లక్ష్మీనారాయణ, రైతులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయండి


భోజన నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

రామగిరి: విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలని తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓ ఫజిల్‌బాషా, ఎంపీపీ మీనుగ నాగమ్మ అన్నారు. నసనకోట సమీపంలోని మహాత్మాజ్యోతి బాపూలే (బాలికల) పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతాన్ని, రికార్డులు పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. సర్పంచ్ మీనుగ నాగరాజు, ప్రిన్సిపాల్ మునిరత్నమ్మ పాల్గొన్నారు.

ఆలయానికి స్థలం కేటాయించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన దృశ్యం

నల్లచెరువు: మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని అయ్యప్ప స్వామి మాలధారులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు తహసీల్దార్ రవికుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆలయాభివృద్ధికి విరాళం


గ్రామస్తులకు నగదు అందజేస్తున్న దృశ్యం

తనకల్లు: మండల పరిధిలోని ఈతోడులో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి రూ. 10 వేల విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని మంగళవారం గ్రామ సర్పంచ్ నాగేంద్ర, నాయకులు రామమోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి చేతుల మీదుగా గ్రామస్తులకు అందజేయించారు. సిద్దారెడ్డి, నరసింహులునాయుడు, ఈశ్వరప్ప, రంగన్న, వెంకటమల్లు తదితరులు పాల్గొన్నారు.

17న భగవద్గీత కంఠస్థ పోటీలు

కదిరి టౌన్: గీతాజయంతిని పురస్కరించుకుని హిందూధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పఠన పోటీలను ఈ నెల 17న కదిరి పట్టణంలోని వాణివీధిలో ఉన్న షిర్డిసాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వివరాలకు (శేషాద్రి 9290587839, రాంమోహన్ 855828854) ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

బైక్ ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని వీవర్స్ కాలనీ సమీపంలో మంగళవారం బైక్ బోల్తా పడి కదిరికి చెందిన బాబు అనే వ్యక్తి గాయపడ్డాడు. ఈయన గోరంట్ల వైపు వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో కిందపడి గాయపడ్డాడు. బాధితుడిని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రేషన్ షాపు డీలర్ మృతి

ఎన్‌పీకుంట: బలిజపల్లి గ్రామానికి చెందిన డీలర్ కె.క్రిష్ణమూర్తి(72) మంగళవారం మృతి చెందాడని బంధువులు తెలిపారు. ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండగా వేకువజామున మదనపల్లికి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందాడని తెలిపారు. ఎంపీడీఓ ఆదినారాయణ నివాళులర్పించారు.